అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయండి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట్: జలమండలి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా వెంటనే పూర్తిచేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జలమండలి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అవసరమైన ప్రాంతాల్లో పైపులైన్ వ్యవస్థ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు భవన, మాజిద్, రోహిత్, షకీర్ తదితరులు పాల్గొన్నారు.

వీడియోగ్రఫీలో మహిళలకు మంచి అవకాశాలు



వర్క్‌షాపులో పాల్గొన్న మహిళలు

సుందరయ్యవిజ్ఞాన కేంద్రం: ఫొటో, వీడియోగ్రఫీ రంగంలో మహిళలకు మంచి అవకాశాలు ఉన్నాయని తెలంగాణ ఫొటో అండ్ వీడియోగ్రాఫర్ల సంక్షేమ సంఘం నేతలు తెలిపారు. సంక్షేమ సంఘం నేత, జయచంద్ర ఫొటోగ్రఫీ అధినేత స్టిల్ కెమెరామేన్ శ్రీధర్ భూశెట్టి ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మహిళలకు ఉచిత ఫొటోగ్రఫీ, వర్క్‌షాపు నిర్వహించారు. మహిళలకు ఫొటోగ్రఫీకి సంబంధించిన కెమెరా మెలకువలు, నూతన టెక్నాలజీ, బిజినెస్ స్కిల్స్ గురంచి వివరించారు. కార్యక్రమంలో వెంకట్‌రెడ్డి, ఎస్‌కే హుస్సేన్, శ్రీనివాస్ గౌడ్, శైలేందర్, లక్ష్మారెడ్డి, ఎల్.జయ మాధురి, తులసి, విజయలక్ష్మీ, శారద పాల్గొన్నారు.

సీబీఎస్ నుంచి 'ఏడుపాయల'కు ప్రత్యేక బస్సులు



వరప్రసాద్

కాచిగూడ: మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఆర్టీసీ కాచిగూడ డిపో ఆధ్వర్యంలో ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు సీబీఎస్ నుంచి ఏడుపాయల జాతరకు ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ హైదరాబాద్ రీజినల్ మేనేజర్ వరప్రసాద్ తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రయాణికుల రద్దీకనుగుణంగా ప్రతి 20 నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

ఉగాది నంది పురస్కారాలకు ఆహ్వానం

చిక్కడపల్లి: క్రోధినామ సంవత్సరం సందర్భంగా శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఉగాది జాతీయ నంది పురస్కారాలు, తెలుగుతేజం, తెలంగాణ తేజం పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు ఆ సంస్థ స్థాపక కార్యదర్శి జి.కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 29న ఢిల్లీలో ఈ అవార్డులను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సంగీతం, సాహిత్యం, నృత్యం, విద్య, వైద్యం, న్యాయవాద, టీవీ, సినీ, రాజకీయ, సేవ, వ్యాపారం, పారిశ్రామిక క్రీడా, కళారంగం, జ్యోతిష్య, వాస్తు, అర్చక, పురోహిత తదితర రంగాలవారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆసక్తిగల వారు ఈ నెల 15లోగా తమ పేర్లు నమోదు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు జి.కృష్ణ 94945 23562 నంబర్ ఫోన్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.

ప్రధాని మోదీకి బీజేపీ నేతల స్వాగతం



ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు తదితరులు

కాచిగూడ: ప్రధానమంత్రి నరేంద్రమోదీ మంగళవారం సికింద్రాబాద్ ఉజ్జయిని మహాంకాళి అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన సందర్భంగా బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు, కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్‌ల ఆధ్వర్యంలో పార్టీనేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో సుభాష్ పటేల్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, చిట్టి శ్రీధర్, అశోక్ కులకర్ణి, మల్లికార్జున్, బి.భీమ్‌రాజ్, రవియాదవ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ఐఎల్‌పీ కృషి

చిక్కడపల్లి: ఇండియా లిటరసీ ప్రాజెక్ట్ (ఐఎల్‌పీ) సుమారు 33 సంవత్సరాల కిందట ప్రారంభమై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తీర్చిదిద్దిందని ప్రాజెక్ట్ కెరీర్‌గైడ్‌లు సామ్య, సోనుకుమార్, కిషోర్ తెలిపారు. మంగళవారం చిక్కడపల్లిలో వారు మాట్లాడుతూ అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఇప్పటివరకు 250కిపైగా పాఠశాలల్లో డిజిటల్ కంటెంట్‌ను, 600కి పైగా లైబ్రరీలను స్థాపించినట్లు చెప్పారు. హైదరాబాద్ జిల్లాలో వంద ఉన్నత పాఠశాలల్లో 9, 10 తరగతుల విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తయారు చేయాలన్న ఉద్దేశంతో కెరీర్‌గైడెన్స్ వర్క్‌షాప్‌లు నిర్వహించినట్లు వివరించారు. టెన్త్ తర్వాత ఉండే కోర్సులలో ఉండే మెస్సేజ్‌ల రూపంలో కావాల్సిన సమాచారం తెలుసుకునేందుకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. 93848 80336 వాట్సాప్ నంబర్ ద్వారా స్పష్టమైన సమాచారం వస్తుందన్నారు. ఇప్పటివరకు 50 వేల మంది రిజిస్టర్ అయి ఉండగా 2 లక్షలకుపైగా సందేశాలకు చేరుకుందన్నారు. స్కాలర్‌షిప్ పొందడానికి గైడెన్స్ కోసం 74168 63830 హెల్ప్‌లైన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

శతాబ్ది లయన్స్ క్లబ్‌కు 30 అవార్డులు

చిక్కడపల్లి: లయన్స్ ఇంటర్నేషనల్ సమావేశంలో శతాబ్ది లయన్స్ క్లబ్‌కు వివిధ విభాగాల్లో క్లబ్ సభ్యులు వ్యక్తిగతంగా 30 అవార్డులు అందుకున్నారు. మంగళవారం రాత్రి చిక్కడపల్లిలో జరిగిన సమావేశంలో పాల్గొన్న 17 క్లబ్బులలో శతాబ్ది లయన్స్ క్లబ్‌కు 30 అవార్డులు రావడంతో ఆ క్లబ్ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. క్లబ్ పూర్వ అధ్యక్షుడు పేరి నాగేశ్వర్‌రావుకు స్పెషల్ అప్రిసియేషన్ అవార్డును బహూకరించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆ ఇద్దరు విద్యార్థినులది ఆత్మహత్యకాదు

- న్యాయం చేయాలంటూ ఇందిరాపార్కు వద్ద బాధిత కుటుంబాలు ధర్నాకు యత్నం
- అనుమతిలేదంటూ అడ్డుకున్న పోలీసులు



ఆందోళనకారులకు సర్దిచెపుతున్న దోమలగూడ సీఐ శ్రీనివాస్‌రెడ్డి



రోడ్డుపై పడుకొని నిరసన వ్యక్తం చేస్తున్న భవ్య తల్లి లలిత

కవాడిగూడ: భువనగిరి హాస్టల్ విద్యార్థినులు భవ్య, వైష్ణవిలది ఆత్మహత్య కాదని కుటుంబ సభ్యులు స్పష్టం చేశారు. న్యాయం చేయాలని కోరుతూ భవ్య, వైష్ణవి న్యాయపోరాట కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ఇందిరాపార్కు ధర్నాచౌక్ వద్ద ధర్నా చేయడానికి ప్రయత్నించగా అనుమతులు లేవంటూ దోమలగూడ పోలీసులు అడ్డుకున్నారు. బాధితుల కుటుంబ సభ్యులు లలిత, నాగరాజు వివిధ మహిళా సంఘాల నాయకులు ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో నినాదాలు చేస్తూ ఉదయం 11 గంటలకు ధర్నాచౌక్‌కు చేరుకున్నారు. న్యాయపోరాట కమిటీ నేతలు కచ్చితంగా ధర్నా చేసి తీరుతామని, తమ పిల్లలది ఆత్మహత్యకాదని, అది ముమ్మాటికి హత్యేనని ఆరోపించారు. న్యాయం జరిగేవరకు కదిలేది లేదంటూ భవ్య తల్లి లలిత రోడ్డుపై పడుకొని నిరసన వ్యక్తం చేశారు. రంగంలోకి దిగిన దోమలగూడ మహిళాపోలీసులు వారికి సర్దిచెప్పి ప్రజావాణిలో ఫిర్యాదు చేసుకోవాలని సలహా ఇవ్వడంతో వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పీవో డబ్ల్యూ నేతలు సంధ్య, ఝాన్సీ, చేతన మహిళాసంఘం నాయకురాలు బి.జ్యోతి మాట్లాడుతూ భవ్య, వైష్ణవి ఆత్మహత్య ఘటనపై సమగ్ర విచారణ జరిపించి వారి కుటుంబసభ్యులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. న్యాయం జరిగే వరకు ఆ రెండు కుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు.

శివాజీ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

కాచిగూడ: శివాజీ జయంతి రోజున నేషనల్ హాలిడేగా ప్రకటించాలని ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ చైర్మన్ సీడీ చవాన్ కోరారు. మహారాష్ట్రలో థానేలో భారతీయ మరాఠా మహాసంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చవాన్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శివాజీ మహారాజ్ నేషనల్ హాలిడే ప్లేకార్డును మహారాష్ట్ర ఎమ్మెల్సీ రవీంద్ర పాఠక్ ఆవిష్కరించారు. సెలవుదినం కోసం క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికలలోపు శివాజీ మహారాజ్ జయంతి రోజును నేషనల్ హాలిడేగా ప్రకటించాలని డిమాండ్ చేశారు.



మట్టికుప్పలను వెంటనే తొలగించండి

కార్పొరేటర్ కన్నె ఉమారమేష్‌యాదవ్



తుల్జాభవన్ వద్ద మట్టికుప్పలను తొలగించాలని సూచిస్తున్న ఉమారమేష్

కాచిగూడ: బర్కత్‌పుర తుల్జాభవన్ వద్ద రోడ్డుపై మట్టి పేరుకుపోయి ఉండటంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడుతోంది. రోడ్డుపై వర్షపునీరు వెళ్లడానికి ఏర్పాటు చేసిన కాలువ నిర్మాణపు పనులు పూర్తయినా మట్టిని ఇప్పటివరకు తొలగించలేదు. దీంతో పాదచారులు, వాహనదారులు నిత్యం అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. మంగళవారం కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ స్పందించి మట్టికుప్పలను వెంటనే తొలగించాలని జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బీజేపీ నేతలు సంతోష్, భీమ్‌రాజ్, రవియాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణలపై కొరడా



సీపీఎల్ రోడ్‌లో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

అంబర్‌పేట్: ఫుట్‌పాత్ అక్రమణలపై జీహెచ్‌ఎంసీ అధికారులు కొరడా ఝుళిపించారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. మంగళవారం సీపీఎల్ రోడ్‌లోని ఫుట్‌పాత్‌లను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకున్నారు. ఆక్రమణలను తొలగించారు. నియోజకవర్గంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను దశలవారీగా తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు టౌన్ ప్లానింగ్ ఏసీపీ వేణు తెలిపారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

యువత ఆధ్యాత్మిక భావన అలవర్చుకోవాలి



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

చిక్కడపల్లి: యువత అధ్యాత్మిక భావనను అలవర్చుకోవాలని హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ సీనియర్‌నేత గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. మంగళవారం మహాశివరాత్రిని పురస్కరించుకుని చిక్కడపల్లి బ్రహ్మకుమారీస్ కేంద్రం ఆధ్వర్యంలో విశ్లేషణాత్మక ప్రసంగ కార్యక్రమాలు చిక్కడపల్లి వివేక్ నగర్ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయం ఆవరణలో జరిగాయి. మమహాశివరాత్రి సందర్భంగా శ్రీ మద్భగవద్గీత, రాజయోగ అనుభూతి విషయంపై గీతాతత్వ నిపుణులు ఎస్‌బీఐ రిటైర్డ్ మేనేజర్ రాజయోగి బీకే త్రినాథ్ ప్రవచనం చెప్పారు. చిక్కడపల్లి బ్రహ్మకుమారీ కేంద్రం ఇన్‌చార్జ్ జయశ్రీ, శ్రీదేవి, గాయకుడు త్రినాథరావు, నైజీరియా దేశానికి చెందిన కుమారి గౌతమి బుగ్గా లక్ష్మీపతిశర్మ, ఆర్యవైశ్య, సంఘం ప్రతినిధి లింగా ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిశీలనకే పర్యటనలు



ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు వినతిపత్రం అందజేస్తున్న దయానంద్‌నగర్ కాలనీవాసులు

ముషీరాబాద్: ప్రజాసమస్యలను తెలుసుకునేందుకు ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలోని పలు బస్తీలలో పర్యటిస్తున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. మంగళవారం అడిక్‌మెట్ డివిజన్‌లోని దయానంద్ నగర్‌లో అధికారులు, నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా తాగునీరు, డ్రైనేజీ, పారిశుద్యం, వీధిదీపాలు, రోడ్లు తదితర సమస్యలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరించేలా చర్యలు చేపడతామని ఆయన స్థానికులకు హామీ ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోని వాటికి శాశ్వత పరిష్కారాలు చూపించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే కాలనీలు, బస్తీలలో పర్యటించడం జరుగుతుందన్నారు. నెలకొన్న సమస్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చి త్వరితగతిన పరిష్కారం అయ్యేలా చూస్తున్నామన్నారు. అడిక్‌మెట్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు బి.శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి కడప సురేందర్, మీడియా సెల్ ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్, రవి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ ఆధారిత వృత్తుల బలోపేతమే 'విశ్వకర్మ' లక్ష్యం



వెరిఫికేషన్ కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి: కళాకారుల కటుంబ ఆధారిత వృత్తులను బలోపేతం చేయడమే పీఎం విశ్వకర్మ యోజన పథకం లక్ష్యమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అన్నారు. పీఎం విశ్వకర్మ యోజన పథకం లబ్ధిదారుల వెరిఫికేషన్ కార్యక్రమం చిక్కడపల్లిలోని డివిజన్ వార్డు కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా వార్డు కార్యాలయాన్ని సందర్శించిన కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్ వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలించారు. తొలి విడత కింద రూ. లక్ష వరకు, రెండో విడతకింద రూ.2 లక్షల రుణం అందిస్తాని, ఈ స్కీమ్ 2023 నుంచి 2028 వరకు అయిదేళ్ళపాటు అమలులో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని పొంది లబ్ధి పొందాలని పావనివినయ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్ కుమార్, బీజేపీ నేతలు నర్సింహా, రఘుయాదవ్, శివ తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో మహాధర్నా

ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీ వైఖరిని నిరసిస్తూ బుధవారం లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీఆర్‌ఎస్ పార్టీ మీడియా ఇన్‌చార్జీ ముచ్చకుర్తి ప్రభాకర్ అన్నారు. ఎల్‌ఆర్‌ఎస్, బీఆర్‌ఎస్ విషయంలో కాంగ్రెస్ పార్టీ చేసిన వైఖరిని నిరసిస్తూ మహా ధర్నా చేపడుతున్నామన్నారు. ఉదయం 10 గంటలకు లోయర్ ట్యాంక్‌బండ్ వద్ద గల జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయం ముందు ఈ ధర్నా చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరుకానున్నారని తెలిపారు.

8న మహాశివరాత్రి పూజలు

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్‌లోని శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో 8న మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేకపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవాలయం కార్యనిర్వహణ అధికారి మాచర్ల దేవనాథం, ప్రధాన అర్చకుడు బుగ్గా లక్ష్మీపతి శర్మ తెలిపారు, మంగళవారం దేవాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో అర్చకులు కె.కృష్ణమూర్తి, కందాళ వెంకటాద్రి, ఎస్‌బీవీఎస్ ఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ధర్మకర్తకు అభినందనలు



ఆలయ ధర్మకర్త కాసుల మల్లికార్జున్‌ను సన్మానిస్తున్న మణికొండ వెంకటేశ్వర్ రావు

కాచిగూడ: మహబూబాబాద్ జిల్లాలోని కురవి భద్రకాళి సమేత శ్రీవీరభద్ర స్వామి ఆలయ ధర్మకర్తగా నియమితులైన నగరానికి చెందిన కాసుల మల్లికార్జున్‌ను మంగళవారం బర్కత్‌పురలో వివిధ కుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కలిసి అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర మున్నూరుకాపు మహాసభ అధ్యక్షుడు మణికొండ వెంకటేశ్వర్ రావు, మున్నూరుకాపు ఐక్యపోరాట సమితి అధ్యక్షుడు కొండూరు వినోద్ కుమార్, న్యాయవాదుల సంఘం కార్యదర్శి కాసుల వినోద్, బీజేపీ నేత మించు ఆనంద్ కుమార్, ఉద్దాడి చిత్తరంజన్ రావు, నర్రా సాయికిరణ్, క్రికెట్ కోచ్ కాసుల రమణ, భాస్కర్, మాతూర్ కరణ్ తదితరులు పాల్గొన్నారు.

నిత్య సంగీత శ్రామికురాలు శేషలత



శేషలతను సన్మానిస్తున్న మధుసూదనరావు, కృష్ణ

చిక్కడపల్లి: నిత్య సంగీత శ్రామికురాలు శేషలత అని దూరదర్శన్ మాజీ డైరెక్టర్ డాక్టర్ పాలకుర్తి మధుసూదనరావు అన్నారు. రాగరాగిణి మహిళా సాహితీ, సాంస్కృతిక, సేవా సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి త్యాగరాయ గానసభలో సంగీత విద్వాన్ డాక్టర్ శేషలత చేత త్యాగరాజ పంచరత్న కీర్తనలు గోష్ఠిగానం జరిగింది. ముఖ్యఅతిథి డాక్టర్ పాలకుర్తి మధుసూదన రావు, గేయరచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ పాల్గొని శేషలతను సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎంవీ రమణకుమారి, ఎంవీ సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలు విద్యార్థుల ప్రతిభకు దోహదం


ఎమ్మెల్యే ముఠా గోపాల్



సైన్స్ ఫెయిర్‌ను తిలకిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. కవాడిగూడ డివిజన్‌లోని భాగ్యలక్ష్మీనగర్‌లో ఉన్న కేంబ్రిడ్జి గ్రామర్ హైస్కూల్‌లో మంగళవారం విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌ను ఎమ్మెల్యే ముఠాగోపాల్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన హ్యాండ్‌మేడ్ మైక్రోస్కోప్, వాటర్ ప్యూరిఫికేషన్ స్టేజస్, అండ్ పంపు వర్కింగ్ సిస్టమ్, మానవకంటి నిర్మాణ వ్యవస్థ, ఊపిరితిత్తుల పనితీరు విధానం తదితర అనేక ఎగ్జిబిషన్‌లను పరిశీలించి విద్యార్థుల ద్వారా వాటి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మంచాల రఘు, వైస్ ప్రిన్సిపాల్ బి.లక్ష్మి, పాఠశాల ఇన్‌చార్జి సంగీత, అకాడమిక్ ఇన్‌చార్జి రాధిక, ఉపాధ్యాయులు ఆమని, కళ్యాణి, రేడియెంట్ పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ భక్తియార్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు వల్లాల శ్యామ్‌యాదవ్, నగర నాయకులు శ్రీనివాస్‌యాదవ్, డాక్టర్ శ్రీహరి, దుర్గస్వామి, ప్రవీణ్‌గౌడ్, రూప, మంజుల పెద్ద ఎత్తున పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో కళాత్మక ప్రతిభను పెంపొందించాలి



బద్రుక కళాశాల కల్చరల్ ఫెస్ట్ పోస్టర్ ఆవిష్కరణలో విద్యార్థులతో శ్రీకిషన్ బద్రుక

కాచిగూడ: విద్యార్థుల్లో అంతర్గతంగా దాగి ఉన్న కళాత్మక ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించేందుకు సాంస్కృతిక, సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బద్రుక కళాశాల కార్యదర్శి శ్రీకిషన్ బద్రుక తెలిపారు. బద్రుకా కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో ఇంటర్ కాలేజియేట్ ఫెస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం కాచిగూడలోని కళాశాల ప్రాంగణంలో కల్చరల్ అండ్ మ్యూజికల్ ఫెస్ట్ -2024 పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ అభిరామ్ కృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ బి.మోహన్ కుమార్, డాక్టర్ ఎం.జానకిరామ్, డాక్టర్ పి.వెంకటయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణచంద్ర మూర్తి, 'పటాంగ్‌చిత్ర బృందం పవన్ కౌశిక్, పూజిత్, ప్రీతి, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

నియామకం

కాచిగూడ: సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గ బీజేపీ జాయింట్ కన్వీనర్‌గా ఏడెల్లి అజయ్‌కుమార్‌ను ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి నియమించారు. ప్రస్తుతం ఆయన బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని మరోసారి భారీ మెజార్టీతో గెలిపించే విధంగా కృషి చేస్తానని అజయ్‌కుమార్ అన్నారు. బాధ్యతలు అప్పగించిన కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

మహిళలకు సమాజంలో సరైన ప్రాతినిధ్యం



కామేశ్వరిని సన్మానిస్తున్న జయావెంకటేష్ తదితరులు

చిక్కడపల్లి: మహిళలకు సమాజంలో సరైన ప్రాతినిధ్యం లభిస్తోందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంతలక్ష్మి అన్నారు. బ్రాహ్మణ సేవా సంఘాల సమాఖ్య అరుంధతి వనితావేదిక ఆధ్వర్యంలో మంగళవారం త్యాగరాయగానసభలో భారతీయ మహిళాదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా దూరదర్శన్ డైరెక్టర్ కొల్లాపుర కామేశ్వరి, ప్రముఖ గైన కాలజిస్ట్ డాక్టర్ సూరి శ్రీమతితోపాటు ఇతర రంగాల్లోని ప్రముఖ మహిళలను అవార్డులు, బిరుదులతో సత్కరించారు. అరుంధతి వనితావేదిక అధ్యక్షురాలు, కార్యక్రమ నిర్వహణ ప్రముఖులు జయవెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దూరదర్శన్ విశ్రాంత అధికారి విజయదుర్గ, కన్స్యూమర్ యాక్టివిస్ట్ వింజమూరు కల్యాణి, శ్రీవాణి, రమాప్రభ, చెరువు జ్యోత్స్న, శంకర అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్ జర్నలిస్ట్స్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు



కాచిగూడ: గ్రేటర్ హైదరాబాద్ జర్నలిస్ట్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యత్వ నమోదు కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. వారంపాటు జరిగే ఈ కార్యక్రమానికి తొలిరోజు విశేష స్పందన లభించింది. 50 మంది జర్నలిస్టులు దరఖాస్తు ఫారాలు తీసుకోగా 15 మంది డీడీసహా దరఖాస్తులను సొసైటీ అధ్యక్షుడు మామిడి సోమయ్యకు అందజేశారు.